సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



వెండి బహూకరణ

తాడేపల్లిగూడెం: పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయానికి నడింపల్లి సత్యనారాయణ రాజు, పద్మావతి, వశిష్టలు శుక్రవారం కిలోన్నర వెండిని సమర్పించారు.



సోమేశ్వరా పాహిమాం

భీమవరం(ప్రకాశం చౌక్) : పంచారామ క్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. విశేష అలంకరణ చేశారు.

ఇన్‌చార్జి జేసీగా సూర్యతేజ



భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్‌గా నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత జేసీ మురళి సెలవులో ఉన్నారు.

న్యూస్‌రీల్

సోమేశ్వరునికి హారం సమర్పణ



హారాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం : పంచారామక్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్ద నస్వామి ఆలయంలో స్వామివారికి 260 గ్రాముల బంగారంతో చేసిన హారాన్ని ఓ భక్తుడు శుక్రవారం సమర్పించారు. దీనిని ఈఓ అరుణ్‌కుమార్, ప్రధాన అర్చకులు హారాన్ని పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు చూపించారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ, ఎస్పీ

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం పంచారామ క్షేత్రంలో మహాశివరాత్రి ఏర్పాట్లను శుక్రవారం జిల్లా ఎస్పీ రవిప్రకాష్, ఆర్డీఓ దాసి రాజు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దేవస్థానం అధికారులు, ధర్మకర్తలు, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఉత్సవాలను జయప్రదం చేయాలని సూచించారు. జిల్లా దేవదాయశాఖ అధికారి యర్రంశెట్టి భద్రాజీ, తహసీల్దార్ రవికుమార్, వన్‌టౌన్ సీఐ ఎ.శ్రీను ఉన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు ఆహ్వానం

భీమవరం(ప్రకాశం చౌక్): విశాఖలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహికులు హాజరుకావాలని జిల్లా పరిశ్రమ శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 3, 4 తేదీల్లో విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 నిర్వహించనున్నారని, పలుదేశాల నుంచి పారిశ్రామిక వేత్తలు రానున్నారని పేర్కొన్నారు. పారిశ్రామిక వేత్తలతో పరిచయాలు, భవిష్య ప్రయోజనాలకు సమ్మిట్ దోహదపడుతుందని తెలిపారు. సమ్మిట్‌కు హాజరయ్యే వారు ముందుగా వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9440754254, 8074166736, 7997952344లో సంప్రదించాలన్నారు.

గర్భస్రావంపై అవగాహన అవసరం



కమిటీ సభ్యులతో చర్చిస్తున్న డీఎంహెచ్ఓ

భీమవరం(ప్రకాశం చౌక్) జిల్లా చట్టబద్ధమైన గర్భస్రావ కమిటీ సభ్యులతో శుక్రవారం డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు సమావేశమయ్యారు. గర్భస్రావం ఏ పరిస్థితుల్లో చేయాల్సి ఉంటుందో సభ్యులకు వివరించారు. కమిటీ సభ్యులు గర్భస్రావంపై పూర్తి అవగాహన చేసుకుని అక్రమ గర్భస్రావాలను అడ్డుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు డాక్టర్ లక్ష్మి, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ ఆనంద్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డి.సుధాలక్ష్మి పాల్గొన్నారు.

హాల్‌టికెట్లకు ఇబ్బంది పెట్టొద్దు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్ల జారీలో ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు కళాశాలల ప్రిన్సిపాళ్లను హెచ్చరించారు. హాజరు సరిపోయిన విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వాలని, ఫీజు బకాయిలు, ఇతర కారణాలతో నిరాకరిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏదైనా కళాశాల యాజమాన్యం విద్యార్థికి హల్‌టికెట్ ఇవ్వడంలో ఇబ్బందికి గురిచేస్తే రాష్ట్ర కంట్రోల్ రూమ్ 18004257635 లేదా జిల్లా కంట్రోల్‌రూమ్ 08812 230197 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

నైపుణ్య శిక్షణ ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : యువతకు నైపుణ్య శిక్షణలో భాగంగా ఏలూరు సత్రంపాడు టీటీడీసీలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్కిల్ కాలేజీలో మొదటగా సీనియర్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సును ప్రారంభిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల శిక్షణతో పాటు వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

● వందే శివం శంకరం



జగద్రక్షకుడి పూజకు అశేష భక్తజనం ఆరాటపడుతోంది.. అభిషేక ప్రియుడైన ఆ పరమేశ్వరుడిని ప్రసన్నం చేసుకునేందుకు, ఆదిభిక్షువు సేవలో తరించేందుకు శైవ క్షేత్రాలు సిద్ధమయ్యాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక శోభతో కళకళలాడుతున్నాయి. వందే శివం శంకరం.. అంటూ నామస్మరణలు మార్మోగుతున్నాయి. కాంతులీనుతున్న తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెంలోని బాలా త్రిపురసుందరీ విశ్వేశ్వర పంచాయతన క్షేత్రం, స్ఫటిక లింగ దృశ్యాలివి.

– తాడేపల్లిగూడెం



పట్టిసం.. పరమ పవిత్రం

- క్షేత్రంలో సర్వం సిద్ధం
- గోదావరి దాటేందుకు పంటు మార్గం

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు అఖండ గోదావరి నది మధ్య గల పట్టిసం శివ క్షేత్రం సిద్ధమైంది. మూడు రోజులపాటు ఇక్కడ ఉత్సవాలు జరుగనుండగా శుక్రవారం రాత్రి నుంచి భక్తుల రాక మొదలైంది. క్షేత్రం విద్యుత్ కాంతులీనుతోంది. శనివారం శని త్రయోదశి, మహాశివరాత్రి కావడంతో వేకువజాము నుంచి భక్తుల రాక మరింత పెరగనుంది. ఈ మేరకు అధికారులు పట్టిసం శివక్షేత్రం, ఇసుక తిన్నెలు, పట్టిసం రేవులో పటిష్ట ఏర్పాట్లు చేశారు. గోదావరిపై ఆరు పంట్లుతో కాలినడకన వెళ్లేందుకు వీలుగా మార్గాన్ని ఏర్పాటుచేశారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఎస్పీ పరిశీలన

పట్టిసంలో ఏర్పాట్లను శుక్రవారం జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ప్రాంతాల్లో బందోబస్తు తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలవరం డీఎస్పీ కె.లతాకుమారి, జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి డీఎస్పీ కేవీ సత్యనారాయణ, డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్, పోలవరం సీఐ కె.విజయబాబు ఆయన వెంట ఉన్నారు.



ఇసుక తిన్నెలపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్‌దేశ్ శర్మ



గోదావరి దాటేందుకు పంట్లుతో ఏర్పాటుచేసిన మార్గం

సృజనహితం.. బోధన నైపుణ్యం

విలీనం.. సత్ఫలితం

- విలీన విద్యార్థులకు సృజనాత్మక బోధన
- సబ్జెక్టుకో ఉపాధ్యాయుడు
- ఉమ్మడి జిల్లాలో 718 విలీన పోస్టుల భర్తీ
- బలమైన విద్యా పునాదులే లక్ష్యం

సృజనాత్మకత, నైపుణ్యం, ఆలోచనా శక్తి, ప్రమాణాలు గల విద్యతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని భావించిన ప్రభుత్వం ప్రాథమిక విద్య బలోపేతానికి తీసుకువచ్చిన విలీన ప్రక్రియ సత్ఫలితాలనిస్తోంది. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతోంది. సబ్జెక్టు ఉపాధ్యాయులు అందుబాటులోకి రావడంతో విద్యాప్రమాణాలు మెరుగుపడుతున్నాయి.

ఆకివీడు : పాఠశాలల విలీనం (మిర్జ్) కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను సమీపంలోని హైస్కూళ్లలో విలీనం చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 263 పాఠశాలల్లోని 3,4,5 తరగతుల విద్యార్థులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కలిపారు. ఇక్కడ విద్యార్థులు నూతన విధానంతో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు.

ప్రమాణాలు మెరుగుపడుతూ..

విలీన పాఠశాలల్లోని 3,4,5 తరగతుల విద్యా బోధన కోసం ప్రభుత్వం సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించింది. ఆయా సబ్జెక్టులలో విద్యార్థులు పూర్తిస్థాయిలో నైపుణ్యం సాధించేందుకు, వారిలో సృజనాత్మకశక్తిని పెంపొందించేందుకు నూతన విధానం దోహదపడుతుంది. ఆయా తరగతుల్లో ఇంగ్లిష్, తెలుగు, పరిసరాల విజ్ఞానం, లెక్కల సబ్జెక్టులకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులు ఉన్నారు. దీని వల్ల విద్యార్థులకు పాఠాలపై పట్టు పెరుగుతోంది. వీటికి తోడు విద్యార్థులకు హిందీ పదాలను కూడా నేర్పిస్తున్నారు. గతంలో 1 నుంచి 5 తరగతుల వరకు ఇద్దరు లేదా ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉండేవారు. ఆయా సబ్జెక్టులను వారే బోధించేవారు. దీంతో బోధన అంతంతమాత్రంగా ఉండటంతో పాటు విద్యార్థుల నైపుణ్యాలు పెద్దగా మెరుగుపడేవి కావు. ఆ స్థితి నుంచి విద్యార్థులు ఉన్నత ప్రమాణాలు, నైపుణ్యతతో ప్రస్తుతం చదువులను కొనసాగిస్తున్నారు.



ఆకివీడు మండలం పెదకాపవరం హైస్కూల్‌లో 4వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న తెలుగు టీచర్

విలీన పాఠశాలలు	
పశ్చిమగోదావరి జిల్లా	114
ఏలూరు జిల్లా	263
బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లు	718

స్కూల్ అసిస్టెంట్లతో బోధన

విలీన విద్యార్థులు సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుల బోధన నుంచి స్కూల్ అసిస్టెంట్ల బోధనను అందుకుంటున్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉన్నత స్థాయిలో సౌకర్యాలు, ల్యాబ్, లైబ్రరీ, ఆటస్థలం, క్రీడా సామగ్రితో పాటు పైతరగతుల విద్యార్థుల ప్రవర్తన, వారి ఆలోచనలు విలీన విద్యార్థులకు అలవడుతున్నాయి.

తరల్ శిక్షణ

సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు (ఎస్జీటీ) ఇచ్చిన తరల్ శిక్షణను స్కూల్ అసిస్టెంట్లకు కూడా ఇవ్వడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పలువురు భావిస్తున్నారు. ఆయా లాంగ్వేజ్ సబ్జెక్టులపై తరల్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఇటీవల ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు మిర్జ్ స్కూళ్లకు స్కూల్ అసిస్టెంట్లను ప్రభుత్వం బదిలీ చేసింది. రూ.2,500 గౌరవ వేతనం వీరికి అదనంగా వారికి ఇస్తున్నారు. మొత్తంగా విలీన ప్రక్రియ జయప్రదమైంది.

ఖాళీలను భర్తీ చేశాం



విలీన పాఠశాలల్లో (మిర్జ్) ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. ఇటీవల స్కూల్ అసిస్టెంట్‌లను ఆయా పాఠశాలలకు తాత్కాలికంగా బదిలీ చేశాం. ప్రత్యేక గౌరవ వేతనం ఇస్తున్నాం. మిర్జ్ స్కూళ్లలో మంచి ఫలితాలు వస్తున్నాయి. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతోంది.

– ఆర్వీ.రమణ, డీఈఓ, పశ్చిమగోదావరి జిల్లా

డిజిటల్ తరగతులు



పెదకాపవరం ఉన్నత పాఠశాలలో మిర్జ్ ద్వారా 60 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాం. డిజిటల్ తరగతులు కూడా కొనసాగుతున్నాయి. సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున బోధిస్తున్నారు.

– బందెల శ్రీకాళహస్తీశ్వరుడు, హెచ్ఎం, జెడ్పీ హైస్కూల్, పెదకాపవరం

నైపుణ్యం పెరుగుతుంది



3,4,5 తరగతుల విలీనంతో బాలబాలికల్లో చదువుపై పట్టుదల, కృషి పెరుగుతాయి. ఉపాధ్యాయుడు ఒకే సబ్జెక్టును బోధించడంతో విద్యార్థికి, ఉపాధ్యాయుడిలో నైపుణ్యత పెరుగుతుంది. నాణ్యతా ప్రమాణాలు కలిగిన బోధనను అందుకుంటారు. విలీన ప్రక్రియ మంచి ఫలితాల్ని ఇస్తోంది

– ఆర్వీ నారాయణ(విక్రమ్), జిల్లా రిసోర్స్ పర్సన్(ఆంగ్లం), అజ్జమూరు

బాగా అర్థమవుతున్నాయి



హైస్కూల్‌లో పెద్ద తరగతి విద్యార్థులతో కలిసి చదవడం ఆనందంగా ఉంది. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో ఉపాధ్యాయుడు బోధించడంతో పాఠాలు బాగా అర్థమవుతున్నాయి. పాఠాలు గుర్తించుకోగలుగుతున్నాం. హైస్కూల్‌లో 5వ తరగతి చదువుకునే అవకాశం కల్పించిన సీఎం జగన్ మావయ్యకు ధన్యవాదాలు.

– కట్రెడ్డి నాగశ్రీ రాజరాజేశ్వరి, 5వ తరగతి, జెడ్పీ హైస్కూల్, పెదకాపవరం

గడపగడపకు.. సంక్షేమ పథం



పెనుగొండ : పెనుగొండలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

వంతుల వారీ విధానంపై పర్యవేక్షణ

కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం : దాళ్వా సీజన్‌లో సాగునీటి వినియోగంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2.10 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. వంతులవారీ విధానం ద్వారా అన్ని ప్రాంతాల్లోని భూములకు సాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని, పర్యవేక్షణకు కమిటీలను ఏర్పాటుచేయాలన్నారు. వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద జిల్లాలో 139 యూనిట్లను వచ్చే వారంలోపు గ్రౌండింగ్ చేయాలన్నారు. జిల్లాలో సుమారు 3.76 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు గాను రూ.770 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.730 కోట్లు చెల్లించామన్నారు.



జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

శైవక్షేత్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

భీమవరం(ప్రకాశం చౌక్) : జిల్లాలోని శైవక్షేత్రాల్లో పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. భీమవరం, పాలకొల్లు, ఆచంట, లక్ష్మణేశ్వరం, పెనుమంట్ర తదితర శైవక్షేత్రాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వేగంగా రీసర్వే పనులు

రీసర్వే పనులు వేగవంతం చేసి సత్ఫలితాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో రీ సర్వే పనులపై ఆమె సమీక్షించారు. డ్రోన్ ఫ్లయింగ్ అయిన గ్రామాల్లో చేయాల్సిన పనులు, గ్రౌండ్ ట్రూటింగ్, వ్యాలిడేషన్, గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లపై ఆమె సమీక్షించారు. జిల్లాకు 8,800 సరిహద్దు రాళ్లు వచ్చాయని, వాటిని పాతించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్య తేజ, డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీఓ దాసి రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కలల ప్రాజెక్టు పోలవరం

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

పోలవరం రూరల్ : పోలవరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కలల ప్రాజెక్టు అని, ఆయన శంకుస్థాపన చేసి ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు ఖర్చుపెట్టి ప్రారంభించారని ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. స్పిల్‌వే, ఎగువ దిగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణ పనులను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా పనులు జరిగే విధానంపై ఎస్ఈ నరసింహమూర్తి మంత్రికి వివరించారు. లోయర్ కాఫర్‌డ్యామ్ నిర్మాణ పనులు ఈనెల 15న పూర్తిచేశామని మంత్రి అంబటి అన్నారు. ప్రాజెక్టు పనులు ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నారన్నారు. సీఎం జగన్ హయాంలోనే స్పిల్‌వే, ఎగువ దిగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణ పనులు, స్పిల్‌వే గేట్ల అమరిక, అప్రోచ్ ఛానల్, స్పిల్‌ఛానెల్ తదితర పనులన్నీ పూర్తయ్యాయన్నారు. అలాగే నిర్వాసితుల సమస్యలు కూడా పరిష్కరిస్తున్నామన్నారు. నిర్వాసితుల సమస్యలపై పోలవరం జెడ్పీటీసీ కలుం హేమకుమారి వినతిపత్రం సమర్పించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం మొదటి విడత ఖాళీ చేసిన ఏడు గ్రామాల నిర్వాసితులకు ఆ నష్టపరిహారం వర్తింపజేయాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఏలూరు, రాజమండ్రి ఎంపీలు కోటగిరి శ్రీధర్, మార్గాని భరత్, రాజానగరం, రంపచోడవరం, గోపాలపురం ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, నాగులపల్లి ధనలక్ష్మి, తలారి వెంకట్రావు, ఈఎన్సీ నారాయణరెడ్డి, ఆర్అండ్ఆర్ కమిషనర్ సీహెచ్ శ్రీధర్, స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, సీఈ సుధాకర్ బాబు, ఎస్ఈ నరసింహమూర్తి, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీలు కోటగిరి శ్రీధర్, మార్గాని భరత్, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా

ఇప్పపువ్వు.. గిరిజనుల కల్పతరువు

- మూడు నెలల పాటు అడవి బిడ్డలకు ఉపాధి
- ఇప్పపువ్వులో ఎన్నో పోషకాలు


ఇప్ప పువ్వు


ఇప్పచెట్టు

బుట్టాయగూడెం: ఆదివాసీ గిరిపుత్రులకు అక్కడ లభించే ఉత్పత్తులు జీవనాధారం కల్పిస్తున్నారు. అడవిలో లభించే అటవీ ఉత్పత్తులు సేకరించి వాటిని విక్రయిస్తూ ఉపాధి పొందుతుంటారు. కొందరు అడవిలో ఉండే వెదురుతో బుట్టలు, చాటలు వంటివి నైపుణ్యంలో తయారు చేసి విక్రయిస్తారు. మరి కొందరు తేనె సేకరణ, తునికాకు, అడ్డాకుతో పాటు పలు రకాల ఉత్పత్తులు సేకరిస్తారు. కాలానికి అనుగుణంగా ఉపాధిని ఇచ్చే వృక్షాల్లో ఇప్పచెట్లు ప్రధానమైనవి. వేసవిలో వీటి ద్వారా గిరిజనులు ఉపాధి పొందడానికి అనేక అవసరాలు ఉన్నాయి. ఇప్పపువ్వును గిరిజనులు తెల్లవారుజామునే అడవిలోకి వెళ్ళి సేకరిస్తారు. తెల్లవారుజామున చెట్లపై నుండి కిందపడిన ఇప్ప పువ్వును మధ్యాహ్నానికి సేకరించి ఇంటికి తెచ్చి ఎండబెడతారు.

మూడు నెలల పాటు ఉపాధి

మన్యం ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు ఇప్పచెట్ల ద్వారా మూడు నెలల పాటు ఉపాధి దొరుకుతుంది. ఖరీఫ్, రబీ పనులు ముగిసే సమయానికి ఇప్ప చెట్లు విరగపూస్తాయి. వీటి పువ్వులు గాలికి నేలరాలుతుంటాయి. ఈ పువ్వులను గిరిజనులు సేకరిస్తారు. వీటితోపాటు మొర్రి పండ్లు సేకరించి ఇంటికి తీసుకువస్తుంటారు. వీటిని సేకరించి మార్చి, ఏప్రిల్, మే నెలల్లో విక్రయించి ఉపాధి పొందుతుంటారు.

ఇప్పపువ్వుతో ఔషధాలు తయారీ

గిరిజనులు సేకరించిన ఇప్పపువ్వును జీసీసీల ద్వారా కొనుగోలు చేస్తుంటారు. ఇప్పపువ్వులో ఎన్నెన్నో ఔషధ విలువలు ఉండడంతో ఈ పువ్వును ఔషధాల తయారీకి విక్రయిస్తారు. ఇప్పపువ్వు నుంచి తీసిన తైలాన్ని పక్షవాతం వంటి వ్యాధులకు ఉపయోగిస్తారు. ఇప్పపువ్వుతో దంతాలను శుభ్రం చేసుకోవడంతో దగ్గుకు, దంతాలకు సంబంధించిన వ్యాధులకు ఔషధంగా పనిచేస్తుంది. సచ్ఛమైన ఇప్పపువ్వుతో తయారు చేసిన సారాను సేవిస్తే వృద్ధాప్య లక్షణాలు త్వరగా రాకుండా ఉంటాయని గిరిజనులు అంటున్నారు.

వైద్యశాస్త్రంలోనూ ప్రాధాన్యం

వైద్యశాస్త్రంలోనూ ఇప్పపువ్వు ప్రాధాన్యతను సంపాదించుకుంది. అడవిలో లభించే ఇప్పపువ్వుల గింజల నుంచి తీసిన నూనెలో ఎన్నో పోషక విలువలున్నట్లు శాస్త్రీయంగా నిరూపించారు. భారత శాస్త్రీయ సాంకేతిక మంత్రిత్వ శాఖ సహాయంతో 1999లో నిర్వహించిన పరిశోధనలో ఎండిన ఇప్పపువ్వుల నుంచి పంచదారను తయారు చేసి జామ్, కేక్‌లు, చాక్లెట్‌లు తయారు చేసే విధానాన్ని కనిపెట్టారు. ఇప్పపువ్వు ఎక్కువకాలం నిల్వ ఉండడానికి మధ్యమధ్యలో ఎండిన వేప ఆకును వేస్తే నిల్వ ఉంటుందని తెలుసుకున్నారు.

పశ్చిమ మన్యంలో 20 వేలకు పైగా ఇప్ప చెట్లు

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంతో పాటు పాపికొండల అభయారణ్యంలో ఇప్పచెట్లు దాదాపుగా 20 వేలకు పైగా ఉండవచ్చని అంచనా. ముఖ్యంగా బుట్టాయగూడెం మండలం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఈ ఇప్పచెట్లు అధికంగా ఉన్నాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో కూడా దాదాపుగా 5 వేల చెట్ల వరకూ అటవీప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాల్లో నాటి వాటిని పెంచుతున్నారు. గిరిజనులు సేకరించిన ఈ ఇప్పపువ్వులను జీసీసీ అధికారులే కాదు బయటి నుండి అనేక మంది వ్యాపారులు కూడా కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. ఇప్పపువ్వులో పోషకాలు ఎక్కువగా ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చి వీటిని కొనుగోలు చేస్తున్నట్లు గిరిజనులు చెప్తున్నారు. ప్రస్తుతం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గుత్తుకోయలు, బుట్టాయగూడెం మండలంలో కొండరెడ్లు ఈ పువ్వులను సేకరిస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

5 వేల ఇప్ప మొక్కలు నాటాం



పశ్చిమ అటవీ ప్రాంతంలో సహజ సిద్ధంగా పెరిగిన ఇప్పచెట్లే కాకుండా అడవిలో ఉండే ఖాళీ ప్రదేశాల్లో సుమారు 5 వేల వరకూ ఇప్పమొక్కలను నాటి పెంచుతున్నాం. ఇప్పచెట్ల నుంచి వచ్చే పువ్వుల ద్వారా గిరిజనులు ఉపాధి పొందుతున్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో గుత్తుకోయలు, బుట్టాయగూడెం మండలాల్లో కొండరెడ్లు ప్రస్తుతం ఇప్పపువ్వు సేకరణలో ఉపాధి పొందుతున్నారు. – దావీదురాజు నాయుడు, అటవీ శాఖ డీఆర్‌ఓ, పోలవరం

జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి



మా గ్రామ సమీపంలోని అడవుల్లో ఇప్పపువ్వుతోపాటు పలు ఉత్పత్తులు లభిస్తున్నాయి. ఇప్పపువ్వుతోపాటు పలు ఉత్పత్తులను గతంలో కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం జీసీసీ అధికారులు ఇప్పపువ్వు కొనుగోలు చెయ్యడంలేదు. ప్రస్తుతం ఇప్పపువ్వు సీజన్ ప్రారంభమవుతుంది. జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలని కోరుతున్నాం.

– కెచ్చెల బాలిరెడ్డి, కొండరెడ్డి గిరిజనుడు– మోదేలు

క్లుప్తంగా

ఓబీసీ మహిళల వాటా తేల్చాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

ఏలూరు (టూటౌన్): ఓబీసీ మహిళల వాటా తేలేంత వరకూ పార్లమెంటులో మహిళా బిల్లును ఆమోదించరాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. స్థానిక వసంత్ మహల్ సెంటర్‌లోని ఓ ప్రైవేటు హాలులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా బిల్లును ఈ శీతాకాల సమావేశాల్లో ప్రవేశ పెట్టాలనే ఆలోచన చేస్తున్నారన్నారు. మహిళా బిల్లును ఎవరూ పూర్తిగా వ్యతిరేకించడం లేదని, బిల్లులో బడుగు వర్గాల మహిళలకు రిజర్వేషన్ రూపొందించాలని కోరారు. రాజకీయ పార్టీలకు చిత్త శుద్ధి ఉంటే 33 శాతం మహిళా రిజర్వేషన్‌తో పాటు ఓబీసీ మహిళల రిజర్వేషన్ బిల్లు కూడా పెట్టాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమవరపు పాపారావు, ప్రధాన కార్యదర్శి తాడిశెట్టి గోపీరావు, ఏలూరు నగర అధ్యక్షుడు మారగాని చంద్రకిరణ్, ఉపాధ్యక్షుడు చింతపల్లి రవిచంద్ర కుమార్, జాయింట్ సెక్రటరీ తెర్లి వెంకటేశ్వరరావు, మర్రి శ్రీనివాసరావు, బీసీ సంఘం యువజన విభాగం ఉపాధ్యక్షుడు జి.ద్వారకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయ ముఠా అరెస్టు


పోలీసుల అదుపులో గంజాయి ముఠా సభ్యులు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలో గుట్టుగా గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్ చెప్పారు. శుక్రవారం వన్‌టౌన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శ్రీనివాస సెంటర్ ప్రాంతంలోని ఆర్‌ఓబీ కింద జోరుగా గంజాయి విక్రయాలు జరుగుతుండగా ఎస్పీ ఆదేశాలతో వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను, ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు ఈనెల 16న దాడిచేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ. 1.10 లక్షల విలువైన 22 కిలోల గంజాయి, 7 సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో పాలకోడేరు గ్రామానికి చెందిన మామిడిశెట్టి సుధాకర్, భీమవరం మండలం కొవ్వాడ అన్నవరానికి చెందిన పందిటి రాజశేఖర్, భీమవరానికి చెందిన కర్రి వినయ్ కుమార్, ఉండి మండలం వెలవ్రరుకు చెందిన గుల్ల ఐజాక్ రాజు(దిల్ రాజు), యనమదుర్రు కాలువగట్టుకు చెందిన వేదమూర్తి వంశీకృష్ణ, చింతలదొడ్డికి చెందిన దుగ్గిరాల ప్రవీణ్, ఆకివీడు మండలం దుంపగడపకు చెందిన కప్పల జేమ్స్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు డీఎస్పీ చెప్పారు. కేసును ఛేదించిన సీఐ శ్రీను, ఎస్సై వెంకటేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుళ్లు టి.గోవిందరాజులు, వై.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు టి.ముత్యాలరాజు, కె.నరేష్, వై.దుర్గారావును ప్రత్యేకంగా అభినందించారు.

క్రైం కార్నర్

కట్నం వేధింపులపై కేసు నమోదు

ఆకివీడు: నిడమర్రు మండలం చానమిల్లి గ్రామానికి చెందిన నిడమనూరి మౌనికను భర్త, అత్తమామలు, ఆడపడుచులు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నట్లు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కే.రాజారెడ్డి చెప్పారు. ఆకివీడుకు చెందిన మౌనికకు చానమిల్లికి చెందిన బాబ్జీతో 2010లో వివాహమైంది. బిడ్డ పుట్టినప్పటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారని చెప్పారు.

కోడిపందేలపై దాడి

తాడేపల్లిగూడెం రూరల్: కోడిపందేల శిబిరంపై దాడి చేసి, తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుంచనపల్లి శివారు చెరుకువాడ మహేంద్రవర్మ పొలాలు సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా తొమ్మిది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.20 వేల నగదు, రెండు కోళ్ళు, నాలుగు కోడి కత్తులు, నాలుగు మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ నోట్ల కేసులో వీఆర్వో సస్పెన్షన్

నరసాపురం రూరల్: నరసాపురంలో ఇటీవల జరిగిన నకిలీ నోట్ల కేసులో నిందితుడైన వీఆర్వో పెద్దిరాజును విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ ఎస్ఎం ఫాజిల్ తెలిపారు. నకిలీ నోట్లను బ్యాంకులో జమచేసి మోసగించిన కేసులో ముద్దాయిగా ఉన్న వీఆర్వో అరెస్టయి ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ద్వారకాతిరుమల: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఒక వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండలంలోని రాళ్లకుంట సెయింట్ గ్జేవియర్ పాఠశాల సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కొమ్మర గ్రామానికి చెందిన మానూరి వెంకన్న ద్వారకాతిరుమల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. అదే సమయంలో తూర్పు గోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, అయ్యవరానికి చెందిన దెయ్యాల అప్పలరాజు స్వగ్రామం నుంచి బైక్‌పై ద్వారకాతిరుమల వెళ్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఈ రెండు బైక్‌లు వేగంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకీ తరలించారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ వారికి ప్రథమ చికిత్సనందించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే వెంకన్న పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

కొడుకు సహా వివాహిత అదృశ్యం

ఉండి: కొడుకుతో సహా వివాహిత అదృశ్యంపై ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కే.గంగాధరరావు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం వాండ్రం గ్రామానికి చెందిన మహిళ భర్తతో విబేధాల కారణంగా నాలుగేళ్లుగా తండ్రి ఇంటి వద్దే ఉంటుంది. శుక్రవారం కొడుకుకు జ్వరంగా ఉందని బిడ్డను తీసుకుని గ్రామ పరిధిలోని ప్రైవేట్ వద్దకు వెళ్లింది. అనంతరం కనిపించకుండా పోయిందని, ఆమె మొబైల్ కూడా స్విచాఫ్‌లో ఉందని తండ్రి ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కే. గంగాధరరావు తెలిపారు.

70 గ్రాముల బంగారం స్వాధీనం


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ కేవీ మనోహరాచారి

పెనుగొండ: వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ నుంచి రూ.4 లక్షలు విలువైన 70 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నర్సాపురం డీఎస్పీ కేవీ రవిమనోహరాచారి శుక్రవారం పెనుగొండ పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన దొంగ అయ్యప్ప వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఈ నేపథ్యంలో పెనుగొండ మండలం ఘటాల దిబ్బ, సోమరాజు చెరువుల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. పట్టపగలు తెరిచి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడేవాడు. అయ్యప్పను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ కేవీ మనోహరాచారి తెలిపారు.

పరిశ్రమల స్థాపనకు ఏపీ అనుకూలం


మాట్లాడుతున్న వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: పెద్ద పరిశ్రమలకే కాకుండా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ చాలా అనుకూలమైన ప్రాంతమని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఇక్కడ తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవచ్చని రాష్ట్ర ఎంఎస్ఎంఈ చైర్మన్ వంక రవీంద్రనాథ్ చెప్పారు. శుక్రవారం చెన్నైలోని లీలా ప్యాలెస్ హాల్‌లో జరిగిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత, ఇతర అధికారులతో కలిసి పాల్గొని మాట్లాడారు. మార్చి 3, 4 తేదీలలో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్‌కు పారిశ్రామికవేత్తలు హాజరై రాష్ట్ర ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆహార ధాన్యాలు, ఫౌల్ట్రీ, సిరామిక్ పరిశ్రమలకు అనుకూలమని, ఈ రంగాలలో విలువ ఆధారిత పరిశ్రమలకు మంచి అవకాశాలున్నాయని చెప్పారు. టెక్స్‌టైల్ రంగంలో కూడా తమిళనాడు పారిశ్రామికవేత్తలకు మంచి వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిన్న పరిశ్రమలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.

కుడుపూడి నియామకంపై హర్షం


తణుకులో మాట్లాడుతున్న శెట్టిబలిజ సంఘ నాయకులు

తణుకు అర్బన్: ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాష్ట్ర శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణ రావు పేరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఖరారు చేయడంపట్ల తణుకు శెట్టిబలిజ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శెట్టిబలిజలను అందలమెక్కించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని సంఘీయులు పేర్కొన్నారు. తణుకు సానబోయిన వారి వీధిలోని రామాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో థ్యాంక్యూ సీఎం సార్ అని నినదించారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి దంగేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ శెట్టిబలిజలను గుర్తించిన ఏకైక నాయకుడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని అన్నారు. శెట్టిబలిజల చిరునామా జగన్ అనేలా మాకు గౌరవం కల్పించిన జగనన్నను మరచిపోమని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దొమ్మేటి గోపాలకృష్ణమూర్తి, సానబోయిన శ్రీనివాసరావు, గుత్తుల సూర్యనారాయణమూర్తి, గుబ్బల సూర్యచంద్రరావు, సానబోయిన దుర్గాప్రసాద్, గుడాల శ్రీనివాసరావు, పిల్లి ముత్యాలరావు, సానబోయిన రామచంద్రరావు, సానబోయిన దామోదరరావు, సానబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి చంద్రరావు, పాల్గొన్నారు.

వైఎస్సార్ యూనివర్సిటీ విద్యార్థుల ఎంపిక



జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపకులపతి జానకీరామ్

తాడేపల్లిగూడెం: ఈ నెల 20 నుంచి హరియాణ రాష్ట్రం హిసార్‌లో జరగనున్న 21వ అఖిల భారత వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలకు వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ విద్యార్థులు ఎంపికయ్యారు. యూనివర్సిటీ ఉపకులపతి శుక్రవారం వివరాలు వెల్లడించారు. గత నెలలో అంతర్‌వర్సిటీ క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన 36 మంది విద్యార్థులు చౌదరి చరణ్‌సింగ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణ పరీక్షకు 33,540 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన పర్యావరణ విద్య పరీక్షకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 33,540 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 29,517 మంది జనరల్ విద్యార్థులుండగా 4023 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. ఏలూరు జిల్లాలోని 97 కేంద్రాల్లో జరిగిన జనరల్ పరీక్షకు 11,177 మంది విద్యార్థులకు గాను 11000 మంది హాజరు కాగా, 4222 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 4023 మంది హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 110 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 14,099 మంది జనరల్ విద్యార్థులకు 13,947 మంది హాజరు కాగా, 1549 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1487 మంది హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 43 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 4619 మంది జనరల్ విద్యార్థులకు గాను 4570 మంది హాజరు కాగా, 817 మంది ఒకేషనల్ విద్యార్థులకు 753 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు తెలిపారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు ఎంపిక

సాక్షి, భీమవరం: సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కె.యశ్వంత్‌రాయల్ ఎంపికయ్యాడని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. ఈనెల 13, 14 తేదీల్లో విశాఖపట్నంలోని రఘు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూకే క్రికెట్ సెలక్షన్స్‌లో ఎంపికయ్యాడని తెలిపారు. ఈనెల 20 నుంచి బెంగుళూరులో నిర్వహించే సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటాడని వివరించారు. యశ్వంత్‌రాయల్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, ఆర్.శ్రీనివాసరాజు, శ్రీనివాసరావు అభినందించారు.

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్


సెల్ టవర్ ఎక్కిన వసంతరావు

కైకలూరు: మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కి అధికారులకు ముచ్చెమటలు పట్టించాడు ఓ వ్యక్తి. ఈ ఘటన కై కలూరు శివారు ఏలూరు రోడ్ వద్ద శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే జూట్రూ వసంతరావు(40) తాపీ పని చేస్తూ జీవిస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించి ఇంటి సమీపంలోని సెల్ టవర్ ఎక్కాడు. ఇది చూసిన ప్రజలు సమీపంలోని ఫైర్ సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. పలుమార్లు మైక్ ద్వారా కిందకు దిగాలని కోరారు. తనకు ఇంటి స్థలాన్ని కేటాయించారని అయితే అధికారులు స్థలాన్ని చూపించలేదని వాపోయాడు. చివరకు ఎమ్మెల్యే డీఎన్నార్ వచ్చారని చెప్పడంతో కిందకు దిగాడు. దీంతో అందరూ ఊపిరిపిల్చుకున్నారు. పోలీసులు వసంతరావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

లక్ష పసుపు కొమ్ముల అలంకరణ



కోమటిగుంటలో కొలువు దీరిన దుర్గాదేవి అమ్మవారిని లక్ష పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని దుర్గాదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆచార్య శ్రీనివాసులు వెంకట్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు ఎరుబండి రామాంజనేయులు దంపతులు కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొరకుటి సత్యనారాయణ, మోటురి కృష్ణ, అద్దాల శ్రీనివాస్, పానకాల రాము తదితరులు పాల్గొన్నారు. -కాళ్ల

క్లుప్తంగా

దోమల నియంత్రణ అందరి బాధ్యత



దోమల నియంత్రణపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వై.వి.లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం: దోమల నియంత్రణ అందరి బాధ్యతని, దోమలు పెరగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు కోరారు. శుక్రవారం యాగర్లపల్లి పరిధిలోని డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్యకేంద్రం పరిధిలోని 13,16,18 వార్డుల్లో జరిగిన ఫీవర్ సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూస్తే, దోమలు పెరగవన్నారు. ప్రజలంతా దోమ తెరలు వాడాలన్నారు. ప్రజలు వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు చంద్ర, ఝాన్సీ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

19న ఉచిత హోమియో వైద్య శిబిరం

అత్తిలి: ఈనెల 19న అత్తిలిలో ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సభ్యులు తెలిపారు. అత్తిలిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈశిబిరంలో కీళ్ల నొప్పులు, థైరాయిడ్, కిడ్నీ వ్యాధులు, స్త్రీలవ్యాధులు, డయాబెటిక్, ఎలర్జీ వ్యాధులకు ఉచితంగా మందులు అందజేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

తణుకు అర్బన్: ఆర్టీసీ ప్రయాణం సురక్షితం, సులభతరం అని తణుకు డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి అన్నారు. ఏలూరు, గణపవరం రూట్లలో ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు ప్రయాణించిన ప్రయాణికుల టికెట్స్‌కు శుక్రవారం డిపో ఆవరణలో డ్రా తీసి ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో షాలేమ్ పెన్ కార్నర్ అధినేత అమర్‌నాథ్, ట్రాఫిక్ ఇనస్పెక్టర్ 2 బీవీకే రావు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రతి నెలా 1వతేదీన వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ నాయకులు తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్నికల్లో హామీగా ఇచ్చిన సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బివి నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి ఎం రామచంద్రరావు, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌రాజు, ఎం నాగరాట్నాలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌కు మంచి స్పందన

తణుకు టౌన్: ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ (ఫ్యామిలీ డాక్టర్) పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, దీనికి మంచి స్పందన వస్తోందని వైద్యాధికారి బంగారు రవి చెప్పారు. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్స్ పథకంలో భాగంగా శుక్రవారం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డా.రవి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అశ్రద్ధగా ఉన్న వారిని గుర్తించి ఫ్యామిలీ డాక్టర్స్ కార్యక్రమంలో చికిత్స అందిస్తున్నామని చెప్పారు. 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు.ఈకార్యక్రమంలో హెచ్‌వీ వీ రాణి, ఎంపీహెచ్‌ఎస్ జయరాజు, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవీ ణ, ఎంపీహెచ్‌ఏ వైటీ మూర్తి, సుధా, ఏఎన్‌ఎం అనురాధ, డీఈవో సాయిరాం, ఆశా కార్య కర్తలు, శ్రీదేవి, రమణ, ప్రేమజ్యోతి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేర్చడమే లక్ష్యం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- గృహసారథులు, కన్వీనర్లతో సమావేశం



శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: గృహసారథులు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరును అవగతం చేసుకుని జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పించాలని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద 1 నుంచి 12వ వార్డుల గృహసారథులు, కన్వీనర్లకు శిక్షణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ జగన్ రూపొందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు నూరుశాతం సఫలీకృతులయ్యారని సంతోషం వ్యక్తం చేశారు. నిబద్ధతతో విధులు నిర్వహించే గృహసారథుల వివరాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వద్ద ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల, మత పార్టీల రహితంగా సంక్షేమాన్ని అందిస్తుందని ఈవిషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా తెలియచేయాలని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించిన గృహసారథులకు భవిష్యత్తులో ఉన్నతస్థాయిని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని చెప్పారు. 2024 ఎన్నికల్లో 175 నియోజకవర్గాలను మన వైఎస్సార్‌సీపీ కై వసం చేసుకొనేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి కుటుంబానికి మూడు లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు లబ్ధిపొందారన్నారు. ఎన్నికల మానిఫెస్టోను తూ.చ తప్పకుండా అమలు చేసిన వైఎస్సార్‌సీపీకి ఎదురు నిలబడే ప్రతిపక్షాలు లేవన్నారు. వైస్సార్‌సీపీని నియోజవర్గంలోని ప్రతి కుటుంబం ఆదరిస్తుందని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలే స్వయంగా చెప్పడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా పాలన సాగించి దేశానికి ఆదర్శవంతంగా ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిపారన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో తెదేపా ప్రభుత్వం ప్రజలను దోచుకున్న తీరును ఎండగట్టే విధంగా గృహసారథులు, వార్డు కన్వీనర్లు సమన్వయంతో ప్రజలకు అర్థమయ్యేలా తెలియచేయాలని చెప్పారు. జగన్ దూరదృష్టిని అంచనా వేయలేక చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో అధికారం దక్కించుకోవాలని చంద్రబాబు చేపట్టిన అమరావతి రైతు పాదయాత్ర, ఇదేమి ఖర్మ కార్యక్రమాలు ఎటుపోయాయో తెలియడం లేదన్నారు. తన కుమారుడు లోకేష్‌తో చేయిస్తున్న యువగళం కార్యక్రమం ప్రారంభంలోనే నొప్పులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి భాస్కర రావు, కొలుకులూరి ధర్మరాజు, బోళం రమణ, రామలక్ష్మి, మద్దుల ప్రసాద్, ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి సుధాకరరెడ్డి, వెలిశెట్టి నరేంద్రకుమార్, పత్సమట్ల సావిత్రి, చామన సూర్యచంద్రరావు, బూడి ప్రసాద్, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం

- శనిత్రయోదశి నాడే మహా శివరాత్రి
- ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు



శంకరమఠంలోని స్వామివారు



పార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులుగా శివపార్వతులు



మండపాకలోని సోమేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవం దృశ్యం



అత్తిలిలో విశేష అలంకరణలో శ్రీఉమాసిద్ధేశ్వరస్వామివారు

తాడేపల్లిగూడెం: మహాదేవుని పరిణయ వేడుకలను వీక్షించేందుకు భక్తులు శివశివ శంకరా.. భక్తవ శంకరా అంటూ శివరాత్రి పర్వదినాన శివయ్యను దర్శించుకొనేందుకు సన్నద్ధమవుతున్నారు.శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకర్గంలో వేడుకలను నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రసిద్ధ శైవ క్షేత్రం మండలంలోని వీరంపాలెం క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బాలాత్రిపుర సుందరీ పీఠం నిర్వహణలో శివయ్య కల్యాణం అరుదుగా లభించే స్పటిక లింగ దర్శనానికి భారీగా ఏర్పాట్లు చేశారు. తాడేపల్లిగూడెం డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపటానికి ఏర్పాట్లు చేశారు. పట్టణంలో గోదావరి ఏలూరు కాలువ గట్టున ఉన్న శివాలయంలో ఉత్సవ ఏర్పాట్లు జరిగాయి. క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తాలూకా ఆఫీస్ సెంటర్‌లో ఉన్న శివాలయం, పట్టణంలో పలు ప్రాంతాల్లో ఉన్న శివాలయాలలో ఏర్పాట్లు జరిగాయి. కొండ్రుపోలు, కడియద్ద గ్రామాలలో ప్రసిద్ధ ఆలయాలతో పాటు పెంటపాడు మండలంలోని ఆలయాలలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. గూడెం పట్టణంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం (శంకరమఠం)లో స్పటికలింగ దర్శనానికి ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం మూడు గంటల నుంచి దర్శన ఏర్పాట్లు చేశారు.

వీరంపాలెంలో ప్రారంభమైన పూజలు

వీరంపాలెంలోని శ్రీబాలాత్రిపురసుందరీ విశ్వేశ్వర పంచాయతన క్షేత్రంలో శుక్రవారం రుద్రయాగ మహా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి ఆధ్వర్యంలో రుద్రమహాయాగానికి వెంకటరామ కృష్ణారెడ్డి, చెక్కా వెంకటరమణమూర్తి దంపతులతో కలశస్థాపన జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితుల వేద ఘోష అనంతరం మంగళవాయిద్యాల నడుమ కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులపాటు జరిగే రుద్ర మహాయాగంలో భూప్రస్తార శ్రీచక్రార్చన నవావరణ పూర్వకంగా చేస్తామని వెంకటరమణశాస్త్రి చెప్పారు. శనివారం ఉదయం ఐదు గంటల నుంచి స్పటిక లింగ దర్శనానికి విశేషఏర్పాట్లు చేశామన్నారు.

పెంటపాడులోఘనంగా శివపార్వతుల కల్యాణం

పెంటపాడు: మండలంలో పార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివ రాత్రి పురస్కరించుకొని శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వెలగల లక్ష్మణరెడ్డి, శ్రీదేవి దంపతులు స్వామివారి కల్యాణం జరిపించారు. గ్రామస్తులు ఈ కార్యక్రమానికి భారీగా హజరయ్యారు. శనివారం తెల్లవారు జా ము మూడు గంటల నుంచి స్థానిక ఆల యంలో భక్తులు కోసం దర్శన ఏర్పాట్లు చేసారు.

ఘనంగా స్వామివారి కల్యాణోత్సవాలు

తణుకు టౌన్: మహా శివరాత్రి సందర్భంగా తణుకు మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో కళ్యాణోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తణుకు మండలంలోని తేతలి, మండపాక, కోనాల, వేల్పూరు గ్రామాల్లోని శివాలయాల్లో మండపాకలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా ఉమాసిద్ధేశ్వరుని కల్యాణం

అత్తిలి: మండలంలో ప్రసిద్ధి గాంచిన అత్తిలి పార్వతి సమేత ఉమాసిద్ధేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అత్తిలి గ్రామానికి చెందిన గుడుపు మణి లక్ష్మణరావు, రమాదేవి దంపతులచే స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. కల్యాణోత్సవాలు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను నిర్మించి, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

18, 19 తేదీల్లో ఉచిత కంటి పరీక్షలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణసేవాఛారిటీ ఆసుపత్రిలో ఈనెల 18,19 తేదీల్లో ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైనవారికి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయడంతో పాటు, కళ్లజోళ్లు అందజేస్తున్నామన్నారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హైవేపై గోతిలో పడి వ్యక్తి మృతి

తణుకు: జాతీయ రహదారి ప్రక్కన ఉన్న గోతిలో పడి వ్యక్తి మృతి చెందాడు. దువ్వ గ్రామానికి చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు(33)ఎల్కక్షియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 15న స్నేహితుడు వీరాంజనేయులతో కలిసి రాత్రి పెంటపాడు మండలం అలంపురంవెళ్లి తిరిగి మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. ఈ సమయంలో ముద్దాపురం కాలువవద్ద అవతిలి పక్కన ప్రమాదం జరిగింది. దానిని చూసేందుకు శ్రీనివాసరాజు నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా డివైడర్ పక్కన ఉన్న గోతిలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని చికిత్స నిమిత్తం తణుకు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఉన్నారు. స్నేహితుడు వీరాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై గుర్రయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బస్సు కిందపడి మహిళకు గాయాలు

పెంటపాడు: మండలంలోని గురువారం రాత్రి జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో బస్సు కింద పడి మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. పెంటపాడు ఎస్సై జి. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం నత్తారామేశ్వరం గ్రామానికి చెందిన చింతా వెంకటలక్ష్మి పెంటపాడు ఆంధ్రాబ్యాంక్‌లో నగదు తీసుకొని పెంటపాడులోని తన పుట్టింటికి వెళ్లి తిరిగి నత్తా రామేశ్వరం వెళ్లేందుకు సాయంత్రం ఆచంట బస్సు ఎక్కింది. బస్సు ఎక్కుతుండగా డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఆమె బస్సు ఎక్కుతూ కిందపడి పోవడంతో ఆమెకు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గూడెం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైజి. సత్యనారాయణ తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నిట్ గేట్ వద్ద మత్తు పదార్థాల వినియోగం అనర్థాల గురించి వివరిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ సీఐ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం నిట్ గేట్ వద్ద విద్యార్థులకు ఈ విషయంపై అవగాహన కల్పించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, మద్యం వంటి వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. రాష్ట్రాన్ని డ్రగ్స్‌రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో ప్రాణహాని కలుగుతుందన్నారు. విద్యార్థులు వాటి జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాలు ఎవ్వరైనా వినియోగిస్తే 14500 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎప్పటికప్పుడు సాంకేతిక రంగంలో అత్యాధునిక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, వాటిని అందిపుచ్చుకొనే స్థాయికి విద్యార్థులు ఎదగాలన్నారు. డీన్‌లు జీబీ.వీరేష్‌కుమార్, ఎస్.జయరామ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మారంపల్లి అంగన్‌వాడీ కేంద్రం నెం.120లో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: యుక్త వయస్సు రాకుండా బాలికలకు వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని మారంపల్లి 120, 121 అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కె.శ్రీదేవి మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్టు తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం గెడ్డం దీవెనమ్మ, అంగన్‌వాడీ టీచర్లు కొత్త బంగారం, తాతపూడి అన్నపూర్ణ, ఆశా కార్యకర్త గెడ్డం సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పండ్లమార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ 30వ వార్షికోత్సవం శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో తట్టాగొట్టి పెద్దిరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిధిగా పాల్గొన్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు 40 కోట్ల మంది ఉన్నారని, వీరికి కనీసవేతనాలు అమలు చేయడంతో పాటు ఇతర సౌకర్యాలు అందించాలని కోరారు. నూతన కమిటీని ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా జవ్వాది శ్రీను, ఉపాధ్యక్షునిగా తట్టాగొట్టి పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శిగా గొర్రెల అన్నవరం తదితరులతో కమిటీని ఎంపిక చేశారు.

పేదలకు అన్నదానం ప్రారంభం

అత్తిలి: స్థానిక ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గల శ్రీలలితాదేవి మందిరం వద్ద శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన తలారి బాబు దంపతులచే అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అమ్మవారి మందిరం వద్ద ప్రతి శుక్రవారం పేదలకు అన్నదానం నిర్వహిస్తానని తలారి బాబు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తణుకులో అధికారులకు సూచనలిస్తున్న జోనల్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి

తణుకు అర్బన్: పరిసరాల పరిశుభ్రత, దోమల వ్యాప్తి నిరోధించడంలో ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని జోనల్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని డెంగ్యూ వ్యాధి నిర్ధారణ ల్యాబ్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరి మాట్లాడుతూ ఇంటి పరిసరాలు బావుంటేనే వ్యాధులు ప్రబలకుండా నిరోధించుకోగలమనే విషయాన్ని తెలియచేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక పాతవూరులోని కృష్ణుడి గుడి సమీపంలోని హాస్టల్‌లో పర్యవేక్షించి ఒకే రూంలో ఎక్కువ మంది విద్యార్థులు ఉండరాదని, సదరు హాస్టల్‌పై రిమార్కు నివేదికను సంబంధిత అధికారులకు పంపించాలన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, వైద్య ఆరోగ్యశాఖ పాల్గొన్నారు.

డీఆర్‌జీలో ఓపెన్‌డే కార్యక్రమం

పెంటపాడు: ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ బ్రహ్మాచారి పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణిత అధ్యాపకుడు ఫణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపు తప్పి దుకాణాల్లోకి దూసుకెళ్లిన లారీ

తణుకు: మండలం పైడిపర్రు ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక లారీ అదుపు తప్పి దుకాణాల్లోకి దూసుకెళ్లింది. గుంటూరు నుంచి కాటన్‌బేళ్ల లోడుతో తణుకు వస్తున్న లారీ స్థానిక బస్టాండు ఎదురుగా రోడ్డులోకి వెళ్లే క్రమంలో అదుపు తప్పి దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాక పోగా పలు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.